క్లుప్తంగా

నేడు పుట్టలమ్మ తిరునాళ్ల



కర్లపాలెం: యాజలి గ్రామ దేవత పుట్టలమ్మ తిరునాళ్ల ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరగనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంతో ప్రాముఖ్యత కలిగిన పుట్టలమ్మ అమ్మవారి శిడిమాను ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. గుంటూరు, పల్నాడు బాపట్ల జిల్లాల నుంచి అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో శిడిమాను ఉత్సవానికి తరలిరానున్నారని.. తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కొలుపులలో భాగంగా శనివారం రాత్రి అమ్మవారికి కుంకుమ పూజ, లక్ష మల్లెల పూజ చేశారు. సోమవారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారని మంగళవారం అమ్మవారికి నిర్వహించే మలికొలుపులతో తిరునాళ్ల ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జేసీ శ్రీధర్‌కు అభినందన



బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా ఎల్3 ఏపీఎం యూనియన్ అధ్యక్షుడు తలకాయల థామస్ బాబు, ప్రధాన కార్యదర్శి తూమాటి రాజారావు కలిసి అభినందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



గొరిగపూడి(భట్టిప్రోలు): గొరిగపూడి కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పేస్ సొసైటీ, సందీప్ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ గరిగపాటి మల్లిక ప్రారంభించారు. వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి తక్కువ ధరకు కళ్లజోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్, హెల్త్ ఎస్ఎస్ అధ్యక్షుడు బి.బాబురావు, సచివాలయ కార్యదర్శి ఎండీ జిక్రియ, ఎంఎల్‌హెచ్‌పీ డి.స్వాతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ పీడీ అర్జునరావుకు సన్మానం



బాపట్ల అర్బన్: బాపట్ల డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ బి.అర్జునరావును శనివారం పలు యూనియన్‌ల నాయకులు సన్మానించినారు. ఎల్1, ఎల్2 బాపట్ల జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ చాట్ల సాల్మన్, సెక్రటరీ శొంఠి పూర్ణచంద్రరావు, ట్రెజరర్ కర్ర కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు తిప్పావఝుల శ్రీధర్, ఒరుగంటి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ మల్లవరపు దేవదాస్, ఈసీ మెంబర్ ఎండూరి సుబ్బారావు ఉన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహక నగదు అందజేత



బాపట్ల అర్బన్: మాస్టర్ మైండ్స్ సంస్థలో చార్టెర్డ్ అకౌంటెంట్ కోర్సు విద్యనభ్యసిస్తున్న పోలాసం రోజా పార్వతీ అనే విద్యార్థినికి లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్ అధ్యక్షుడు లయన్ ఆలపర్తి శ్రీనివాసరావు రూ. 5వేలు ప్రోత్సాహక నగదు శనివారం అందజేశారు. లయన్ గోపాలం రఘుపతి రావు, కోశాధికారి వంకాయలపాటి హరిబాబు, సీనియర్ లయన్ సభ్యులు బూర్గుల సంగమేశ్వర శాస్త్రి, యండమూరి ఉషారాణి, టి.రజనీకాంత్ పాల్గొన్నారు.

16న అష్టావధానం

రేపల్లె: పట్టణంలోని శ్రీ లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16న ఆదివారం సాయంత్రం 6.30గంటలకు అష్టావధానం సాహిత్య ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆలయ సింగిల్ ట్రస్టీ గడ్డం రాధాకృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శతావధాని డాక్టర్ బులుసు అపర్ణ, సాహితీ వాచస్పతి మొవ్వా వృషాద్రిపతి పర్యవేక్షణలో నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని తెలిపారు.

పేదలను ఆదుకోవడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: రాష్ట్రంలో ప్రతి పేదవాడిని ఆదుకోవటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గుళ్లపల్లి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. గ్రామంలోని తూర్పు ఎస్సీ కాలనీలో పర్యటిస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా..? లేదా..? అని తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి నాలగేళ్లలో అందిన పథకాలను వివరించారు. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేని విధంగా జగనన్న ప్రభుత్వం బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తోందని తెలిపారు. పేద ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి మరో మారు ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, మండల పార్టీ కన్వీనర్ పైనం ఏడుకొండలురెడ్డి, స్థానిక సర్పంచ్ చెన్ను శివమ్మ, నాయకులు చెన్ను కోటేశ్వరరావు, దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, కామినేని కోటేశ్వరరావు, ఉల్లంగుంట శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మా భవిష్యత్తుకు జగనన్నే భరోసా..

- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ప్రజల మద్దతు
- గృహాలకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు



జువ్వలపాలెంలో కరపత్రాలతో ప్రజలు

కొల్లూరు: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జువ్వలపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నాదెళ్ల నరేంద్ర పాల్గొన్నారు.

భట్టిప్రోలు: జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మండలంలో ఉత్సాహంగా జరుగుతోంది. భట్టిప్రోలు-1, 2 సచివాలయాల పధిలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, కుక్కల వీరరాఘవయ్య, తలకొల యలమంద, షేక్ అబ్దుల్ కరీమ్, పెరికల శ్యామ్, వేల్పూరి నాగేశ్వరరావు, కుక్కల వెంకట్రామయ్య, దాసరి ఫణీంద్ర, వలంటీర్లు పాల్గొన్నారు. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని జిలుగువారిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. ఓలేరు సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్ రజినీకాంత్, సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు నీలా సాంబమ్మ, పరుచూరి వేణు పాల్గొన్నారు. జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్ అన్నపరెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో చుండూరులోని మోదుకూరు-1 సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య పాల్గొన్నారు. సర్పంచ్ బూక్యా సాలి, ఉప సర్పంచ్ అన్నపరెడ్డి రఘురామరెడ్డి, వైస్ ఎంపీపీ ఆళ్ల వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కొల్లి బాలసరస్వతి పాల్గొన్నారు.

రేపల్లె: రేపల్లె పట్టణంలోని 8వ వార్డులో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్ సుభానీ, 10వ వార్డులో కౌన్సిలర్ వీరెళ్ల లక్ష్మీ ప్రసన్న, 26వ వార్డులో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అబ్దుల్ ఖుద్దూష్ శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ప్రభుత్వ విధానాలను తీసుకెళ్లి వారి మద్దతు కూడగట్టారు. గృహాలకు స్టిక్కర్లు అంటించి, కాల్ సెంటర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించి, మద్దతు తెలియజేశారు. మండలంలోని అన్ని పంచాయతీలలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

చెరుకుపల్లి: వైఎస్సార్ సీపీ నాయకుడు బండారు రామారావు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శనివారం చెరుకుపల్లి-1 సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించారు. సచివాయ కన్వీనర్లు, గృహ సారథులతో ఇంటింటికీ వెళ్లారు. సర్పంచ్ దేవరకొండ వాణి, సచివాలయ కన్వీనర్లు కొటారి నాగరాజు, కూరపాటి వేమన, హర్షా పాల్గొన్నారు.



జిలుగువారిపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఎంపీపీ లలిత కుమారి



రేపల్లె పట్టణంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి షేక్ మహబూబ్ సుభానీ



చెరుకుపల్లి-1 సచివాలయ పరిధిలో కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అబ్దుల్ ఖుద్దూష్

ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు



ప్లాస్టిక్ వస్తువులను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు

తెనాలిఅర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయించినా.. ఉపయోగించిన చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, గుమ్మడి ప్రసాద్ హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న దుకాణ యాజమానులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయించవద్దని సూచించారు. హోటల్, రెస్టారెంట్‌లు, మాంసం, కూరగాయాల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన ఒన్‌టౌన్ ఎస్‌ఐ డేవిడ్

తెనాలిరూరల్: తెనాలి ఒన్‌టౌన్ ఎస్‌ఐగా వి. డేవిడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన 16 ఏళ్ల ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో పని చేసి, 2005లో సివిల్ విభాగంలోకి మారారు. ఒంగోలు టౌన్, రూరల్, కందుకూరు, వలివేటివారిపాలెం స్టేషన్‌లలో పని చేసి బదిలీపై తెనాలి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ కె. చంద్రశేఖర్ వద్ద రిపోర్ట్ చేశారు.

మట్టి సారవంతంగా ఉంటేనే దిగుబడి



మట్టి పరీక్షల పై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటరావు

మున్నంగి(కొల్లిపర): మట్టి సారవంతంగా ఉంటేనే దిగుబడి బాగుంటుందని మండల వ్యవసాయ శాఖాధికారి, తెనాలి ఏడీఏ కె.వెంకటరావు అన్నారు. మున్నంగి గ్రామ రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షల ప్రాముఖ్యతపై ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు మట్టి పమూనాల సేకరణపై అవగాహన ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు మట్టి సారవంతం చేయడంపై ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సిబ్బందికి రైతు భూమిలో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు అవశ్యకత, సమస్యాత్మక భూములను సరి చేయడం మొదలగు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిని వీడని మంచు తెరలు



భట్టిప్రోలు-రేపల్లె రహదారిలో కమ్ముకున్న పొగ మంచు

భట్టిప్రోలు: మండు వేసవిలో.. పొగ మంచు తెరలు ఇంకా వీడటం లేదు. పగటి వేళ భానుడు భగ భగమంటున్నా.. నిప్పుల కొలిమి నెలవు మే మాసం సమీపిస్తున్న వాతావరణంలో నెలకొన్న మార్పులతో అర్ధ రాత్రి నుంచి మంచు దట్టంగా కురుస్తోంది. శనివారం ఉదయం 8 గంటల వరకు కూడా మంచు తెరలు పల్లెలను వీడటం లేదు. దీంతో రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక చోధకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మే నెలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఆటోనగర్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సు

తెనాలి: రూరల్ మండల పరిధిలోని ఆటో నగర్‌లో ఆరోగ్యం, భద్రత అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో ప్రతినెల 'హెల్త్ ఫిట్‌నెస్ ఫర్ ఆల్' పేరుతో ఆరోగ్య అవగాహన కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆటో నగర్‌లోని వ్యాపారులకు, కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయటమే కాకుండా, ఆరోగ్య భద్రతపై పలు అంశాలను వారికి తెలియజెప్పారు. ఆటో నగర్ అసోసియేషన్ హాలులో ఉదయం నుంచి జరిగిన సదస్సులో మైత్రీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో అందరికీ వైద్య పరీక్షలు చేశారు. అగ్నిమాపక అధికారి కె.కృష్ణారెడ్డి భద్రతాపరమైన అంశాలను వివరించారు. తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి శివ మాట్లాడారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు సునీల్ పర్యవేక్షించారు.

అరవపల్లిలో పశు వైద్య శిబిరం

రేపల్లె: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అరవపల్లి గ్రామంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ లోయా బాబూ నాంచారయ్య ప్రారంభించారు. మండల పశు వైద్యాధికారి ప్రవీణ్ పశువుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోషకులకు వివరించారు. అనంతరం 330 గేదలు, 25 ఆవులకు మొత్తం 355 పశువులకు వైద్య సేవలు అందించి, టీకాలు వేశారు. పశు యజమానులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్ఏలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్న ఘటన కారుమూరు గ్రామంలో చోటు చేసుకుంది. సెబ్ సీఐ లీనా వివరాల మేరకు.. ముందస్తు సమాచారంతో కారుమూరు గ్రామంలో దాడులు నిర్వహించగా.. గ్రామానికి చెందిన వై. వెంకటేశ్వరమ్మ అనే మహిళ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిందని తెలిపారు. ఆమె నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితురాలిని కోర్టులో హాజరుపరచామని చెప్పారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు

కొల్లూరు: వివాదాన్ని సర్దుమణించేందుకు వెళ్లిన వ్యక్తిపై దాడిచేసి, గాయపర్చిన వ్యక్తులపై శనివారం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. సుగ్గునలంకకు చెందిన సుగ్గున అశోక్, సుగ్గున సాంబశివరావులకు వరిగడ్డి రవాణ చేస్తున్న ట్రాక్టర్లకు చెందిన వ్యక్తులతో గురువారం అర్ధరాత్రి వివాదం జరిగింది. అదే సమయంలో సుగ్గునలంకకే చెందిన దూళిపూడి శ్రీనివాసరావు ఇరు వర్గాలకు సర్ది చెప్పేందుకు ప్రయత్నిస్తుండగా.. అశోక్, సాంబశివరావు కర్రలతో దాడి చేశారు. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజీవ్ శామ్యూల్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

ఉద్యోగ నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులు



పత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయులు

వేమూరు: డీఎస్సీ 1998 బ్యాచ్ అభ్యర్థులకు ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని మండల విద్యా శాఖాధికారి కాజా లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. వేమూరు మండలానికి తొమ్మిది మంది ఉపాధ్యాయులను ఎంపికై నట్లు వివరించారు. వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. డీఎస్సీ క్వాలిపై అయినా.. అప్పటి ప్రభుత్వం తమకు ఉద్యోగాలు ఇవ్వకుండా గాలికొదిలేసిందని మండిపడ్డారు. అప్పటి నుంచి ఉద్యోగాలు కోసం పోరాటాలు చేశామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్వాలిఫైడ్ అయిన ఉపాధ్యాయులకు ఉద్యోగాలు ఇస్తానని, హామీ ఇచ్చి, మాట నిలబెట్టుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ఉద్యోగ బాధ్యతలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈపూరు రాజవర్ధన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించాలి



కాలనీలో సూచనలిస్తున్న కమిషనర్ విజయసారథి

రేపల్లె రూరల్: వైఎస్సార్ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజయ సారథి అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా పట్టణంలోని 18వ వార్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో సచివాలయ సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే అనేక మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని, కొంత మంది లబ్ధిదారుల గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. మిగిలిన లబ్ధిదారులు గృహనిర్మాణాలు వెంటనే ప్రారంభించుకుని త్వరితగతిన పూర్తి చేసుకునేలా ఆర్పీలు, సచివాలయ సిబ్బంది చైతన్య పరచాలన్నారు. ఈ సమావేశంలో ఆర్పీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

23న విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవం



విగ్రహాల ఆవిష్కరణకు చురుగ్గా పనులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు బౌద్ధ స్థూపం సమీపంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్యోద్యమ నాయకులు, జాతీయ సమైక్యతా స్ఫూర్తి ప్రదాతల విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవం ఈ నెల 23న ఉదయం 8:15 గంటలకు నిర్వహించనున్నట్లు వివేకానంద విగ్రహ సాధన కమిటీ నిర్వాహకులు శనివారం తెలిపారు. స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, జెడ్పీ చైర్పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామ దేవత దండిపార్వతీ అమ్మవారి వద్ద ఆహ్వాన పత్రికలు ఉంచి పూజలు నిర్వహించి, ఆవిష్కరించారు.

అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



రాజ్యలక్ష్మి థియేటర్ వద్ద సిబ్బంది ప్రదర్శన

రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని అగ్ని మాపక శాఖ అధికారి వై.సాంబశివరావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సినిమా థియేటర్లు, బస్టాండ్ సెంటరు, రైల్వే స్టేషన్ సెంటరులో ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు కర పత్రాలను పంపిణీ చేసి, వివరించారు. గృహ విద్యుత్ వైరింగ్‌లో లూజ్ కాంటాక్ట్‌లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలాల్లో చెత్తను తగలబెట్టే సమయంలో నీటిని అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది ఎం.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, డి.పాండురెడ్డి, ఎస్.నాగరాజు, పి.హరిబాబు, కేవీ సాయికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్ భానుప్రసాద్

యాజలి(కర్లపాలెం): యాజలి సర్పంచ్ నాదెండ్ల భాను ప్రసాద్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. పుట్టలమ్మ అమ్మవారి తిరునాళ్లకు వచ్చే భక్తులకు చలివేంద్రం ద్వారా తాగునీరందజేస్తామని ఆయన తెలిపారు. కార్యదర్శి సునీత స్థానికులకు తాగునీరు అందజేశారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు

తహసీల్దారు కార్యాలయంలో చలివేంద్రం

నగరం: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. బొరమాదిగపల్లి సర్పంచ్ చందోలు దేవదాసు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.